క్లుప్తంగా

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కన్యాకుమారి

బిక్కవోలు: అర్హులైన కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని తహసీల్దార్ కన్యాకుమారి అన్నారు. గురువారం మండలంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద వీఆర్వోలు, వ్యవసాయశాఖ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 7,220 కౌలు కార్డుల జారీ లక్ష్యం కాగా ఇప్పటివరకూ 3,632 కౌలు కార్డులు మాత్రమే అందించారన్నారు. మిగిలిన 3,588 కార్డుల జారీని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. బిక్కవోలు, బలభద్రపురం, కొమరిపాలెం, పందలపాక, ఊలపల్లి, కొంకుదురుల్లో ఎక్కువగా ఇవ్వాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏఓ శామ్యూల్ జాన్, డీటీ కృష్ణ, ఆర్ఐ నందకిషోర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి



బలభద్రపురంలో మొక్కలు నాటుతున్న స్థానిక నాయకులు

బిక్కవోలు: ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి అన్నారు. గురువారం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 650 కొబ్బరి మొక్కలను బలభద్రపురం గ్రామంలో నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల మేలు కోసం ఇంటింటా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనపర్తి, మండపేట వెలమ సంక్షేమ సేవ సంఘ యూత్ అధ్యక్షుడు ఎస్.అయ్యప్ప, ఎంపీటీసీ చిన్నం రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ చినబాబు

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు, రామేశ్వరం గ్రామ సర్పంచ్ కొటికలపూడి చినబాబు అన్నారు. రామేశ్వరం గ్రామంలో ఇమ్మానుయేల్ చర్చి ఆధ్వర్యంలో అగ్రహారానికి చెందిన క్రిస్టియన్ మెడికల్ ఆస్పత్రి వైద్యులతో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ చినబాబు ప్రారంభించారు. శిబిరంలో 130 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన 10 మందికి శుక్రవారం పిఠాపురంలో శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. స్థానిక పాస్టర్ రెవరెండ్ డాక్టర్ నెహెమ్యా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



ఎడ్ల కృష్ణ

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల కృష్ణ(63) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు గురువారం తెలిపారు. తన తండ్రి ఈ నెల 19 తేదీన ఇంటి నుంచి బయటకి వెళ్లారని, అప్పటి నుంచి కనిపించడం లేదంటూ ఎడ్ల కృష్ణ కుమారుడు శివయ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బుజ్జిబాబు చెప్పారు.

ఉద్యోగాల పేరుతో మోసం

సీతానగరం: ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని, మోసం చేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగరం మండలం ఇనుగంటివారిపేటకు చెందిన కురియాల కస్తూరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి ఉద్యోగాలు ఇప్పిస్తామని రాజమహేంద్రవరానికి చెందిన పెదపూడి నాగమణి, అంబవరపు ఆచార్యులు నమ్మించి రూ.11 లక్షలు తీసుకున్నారు. అలాగే ఉద్యోగాల పేరుతో సీతానగరంలో మరికొందరు వద్ద రూ.15 లక్షల వరకూ వసూలు చేశారు. ఎంతకాలమైనా ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో కస్తూరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యా సమస్యలపై వినతి

కడియం: విద్యా సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.అబ్బాయి, వి.శాస్త్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు యూటీఎఫ్ జిల్లా కోశాధికారి టీవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవోలు మణికుమార్, వై.నాగేశ్వరరావుతో పాటు మండల అధికారులకు గురువారం వినతి పత్రం అందజేశారు.

వరద వచ్చినా నిశ్చింతగా..

- ములకల్లంకలో విద్యుత్ వెలుగులు
- మాజీ ఎమ్మెల్యే రాజా హయాంలో బేబీ టవర్ల ఏర్పాటు
- అంతకు ముందు ప్రజలకు అవస్థలు

సీతానగరం: గోదావరికి వరద వచ్చినప్పుడల్లా ములకల్లంక గ్రామం వార్తల్లో నిలుస్తుంది. నది మధ్యలో ఉన్న ఈ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఈ ఊరికి వెళ్లే రోడ్డు గోదావరి మధ్యలో ఉంటుంది. వరద ప్రవాహానికి అది మునిగిపోవడంతో మరపడవలు, బోట్లపై ప్రజలు రాకపోకలు సాగిస్తారు. వరద చుట్టుముట్టినా ఈ గ్రామస్తులు చాలా ధైర్యంగా ఉంటారు. కానీ అధికారులు మాత్రం అప్రమత్తమవుతారు. ఏ ఇబ్బంది తలెత్తినా ఎదుర్కోవడానికి సర్వం సిద్ధం చేసుకుంటారు.

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవ

ప్రస్తుతం గోదావరి వరదకు కూడా ములకల్లంకలో ఇదే పరిస్థితి నెలకొంది. అయితే గ్రామస్తులు ధైర్యంగా ఉండటానికి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేసిన కృషి దాగి ఉంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన ఆ గ్రామంలో విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆర్‌త్రీ విద్యుత్ (బేబీ టవర్స్) టవర్లను బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాల ఒడ్డున ఏర్పాటు చేశారు. వాటి మీదుగా విద్యుత్ తీగలను వేయడంతో గోదావరి వరద సమయంలో విద్యుత్ నిరంతరం సరఫరా అయ్యింది. దీంతో 2021 నుంచి గ్రామస్తులకు ఇబ్బందులు తప్పాయి.

అప్పట్లో అంధకారం

బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాల మధ్య అర కిలోమీటరు గోదావరి పాయ ఉంది. దాని మధ్యలో రోడ్డు ఉంటుంది. ఇరు గ్రామాల ఒడ్డున విద్యుత్ స్తంభాలు ఉండేవి. గోదావరి పాయ మధ్యలో వెదురుగడలు పాతి, విద్యుత్ స్తంభాల తీగలను వాటికి కట్టేవారు. మామూలు సమయంలో ఇబ్బందులు లేకపోయినా, గోదావరి వరద సమయంలో విద్యుత్ తీగలను తాకుతూ నీరు ప్రవహించేంది. వరదలో కొట్టుకువచ్చే కర్రలు, దుంగలు తగిలి విద్యుత్ తీగలు తెగిపోయేవి. దీంతో ములకల్లంకలో సరఫరా నిలిచిపోయేది.

అవస్థలు

తెగిపోయిన విద్యుత్ తీగలను సరిచేసి, సరఫరా పునరుద్ధరించడానికి దాదాపు రెండు రోజులు పట్టేది.




గోదావరికి రెండు వైపులా బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌త్రీ విద్యుత్ టవర్లు

అప్పటి వరకూ గ్రామస్తులు అంధకారంలో ఇబ్బంది పడేవారు. ఒకవైపు గ్రామాన్ని చుట్టుముట్టిన వరద, మరోవైపు విషకీటకాల భయం, అలాగే టీవీలు, పనిచేయక, సెల్‌ఫోన్లకు చార్జింగ్ లేక అవస్థలు పడేవారు. రాత్రి సమయంలో ఫ్యాన్లు తిరగక దోమలతో సహవాసం చేసేవారు. ఇక చిన్నపిల్లలు, వృద్ధుల అవస్థలు సరేసరి. రాత్రి సమయంలో పశువులకు గడ్డి వేయడానికి వెళ్లాలంటే రైతులకు పెద్ద సాహసమే అయ్యేది.

పలు ప్రమాదాలు

గోదావరి వరదలో పడవలు, లాంచీలు, బోట్లు ప్రయాణం చేయడానికి ఇబ్బందులు ఎదురయ్యేవి. బొబ్బిల్లంక నుంచి ములకల్లంక గ్రామానికి వెళ్లే విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండటంతో వాటికి తగిలి ప్రమాదాలు జరిగేవి. 2020లో లాంచీకి వైర్లు తగిలి విద్యుత్ ప్రవహించడంతో అందులో ఉన్న నలుగురు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆ సమయంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విద్యుత్ శాఖను అప్రమత్తం చేసి, యుద్ధప్రాతిపదికన ఒక్కరోజులో సరఫరాను పునరుద్ధరించారు.

ఆర్‌త్రీ విద్యుత్ టవర్లు

ములకల్లంకలో విద్యుత్ సమస్యకు అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శాశ్వత పరిష్కారం చూపారు. గోదావరిలో తీగల కారణంగా కలుగుతున్న ప్రమాదాలను తెలుసుకుని రూ.19.73 లక్షలతో ఆర్‌త్రీ విద్యుత్ టవర్లను నెలకొల్పడానికి నాంది పలికారు. బొబ్బిల్లంక ఒడ్డున ఒకటి, ములకల్లంక ఒడ్డున మరొకటి ఏర్పాటు చేశారు. 2021లో గోదావరి వరదకు ముందుగానే వీటిని ఏర్పాటు చేయడంతో సమస్యలు తప్పాయి.

విద్యుత్ వెలుగులు

ఇరు గ్రామాల ఒడ్డును నెలకొల్పిన విద్యుత్ టవర్ల నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ వేశారు. ములకల్లంకలో 28 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి 59 వ్యవసాయ మోటార్లకు, ఏడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో 220 ఇళ్ల సర్వీసులు, డ్రికింగ్ వాటర్, వీధిలైట్లకు నిరంతరం విద్యుత్ అందిస్తున్నారు. వరద సమయంలో ఎక్కడ విద్యుత్ పోయినా, ములకల్లంకకు మాత్రం 24 గంటలూ విద్యుత్ ఉంటుంది.

నరకం నుంచి బయటపడ్డాం



గతంలో గోదావరికి వరద వచ్చిందంటే చాలా భయపడేవాళ్లం. ఏ సమయంలో విద్యుత్ పోతుందో తెలియని పరిస్థితి. గ్రామం చుట్టూ వరద నీరు, అందులో కొట్టుకువచ్చే విషకీటకాలతో ఆందోళన చెందేవాళ్లం. రాత్రి సమయంలో నిద్ర ఉండేది కాదు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో ఆ నరకం నుంచి బయటపడ్డాం.

– షేక్ బాషా, ములకల్లంక

విద్యుత్ వెలుగులు



గోదావరిలో ప్రయాణించే లాంచీలు, పడవలు, బోట్లకు వేలాడే తీగలు తగిలి ప్రమాదాలు జరిగేవి. 2020లో లాంచీకి తీగలు తగిలి నలుగురు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బేబీ టవర్లను ఏర్పాటు చేసి మమల్ని భయాందోళనల నుంచి బయటపడేశారు. మా గ్రామంలో వెలుగులు నింపారు.

– సుంకవల్లి సత్యేంద్ర, ములకల్లంక

ఇబ్బంది లేదు



వరద సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రామంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వెలుగులు నింపారు. బొబ్బిల్లంక, ములకల్లంకలలో బేబీ టవర్లు ఏర్పాటు చేసి నిరంతరం విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వరద సమయంలోనూ ఇబ్బంది లేకుండా ఉంటున్నాం. ఎప్పుడు చూడని ఎన్‌డీఆర్ఎఫ్ సేవలను మాకు అందుబాటులోకి తెచ్చింది కూడా అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజానే.

– బొడ్డు సతీష్, ములకల్లంక

ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపేయాలి



పెదపూడిలో ప్లాస్టిక్ నిషేధంపై దుకాణదారులతో చర్చిస్తున్న ఎంపీడీఓ ఆశాజ్యోతి

పెదపూడి: ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల వాడకాన్ని నిలిపేయాలంటూ ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి అన్నారు. స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని పెదపూడి, పైన, రాజుపాలెం, పెద్దాడ తదితర గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువుల వినియోగం నిషేధించాలంటూ నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో మానవాళి మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. దీనిపై వ్యాపారులు, వినియోగదారులు, ప్రజలు అవగాహన పెంచుకుని ప్లాస్టిక్ నిషేధించడానికి సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా క్లాత్ కవర్లు వాడాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, ఎస్వీస్వామి, గౌతమీ చంద్ర, బి.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ వెంకట రమణారావుకు నివాళులు

ఒత్తిడి భరించలేక బలవన్మరణానికి పాల్పడిన నర్సాపురం ఎంపీడీఓ వెంకటరమణారావు చిత్రపటానికి ఎంపీడీఓ ఆశాజ్యోతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఓ చలమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



ఊలపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



సంపత్ నగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని ప్రదర్శన

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య, సంగీత ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి మాట్లాడుతూ దేశంలో కొత్తగా జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలంటూ డాక్టర్ కృష్ణ స్వామి కస్తూరి రంగన్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల మేరకు ఎన్ఈపీ-2020 ప్రవేశపెట్టారన్నారు. ఈ విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే శిక్షా సప్తాహ్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇష్టమైన రంగంలో రాణించండి

రాజానగరం: చదువుతో పాటు మీకు ఇష్టమైన రంగంలో రాణించాలని విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి జ్యోతి ప్రసాద్ సూచించారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సంపత్ నగరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థి దశలోనే వారికి ఇష్టమైన అంశాలను గుర్తించి, సరైన ప్రోత్సాహన్ని అందించేందుకు విద్యాశాఖ సూచనల మేరకు ఈ శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలోనూ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలలో నీటి తరలింపునకు చర్యలు



కాలువను పరిశీలిస్తున్న ఆర్డీవో చైత్రవర్షిణి, ఏపీడీ జ్ఞానేశ్వరరావు తదితరులు

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయంలోని డ్రైనేజీ వ్యవస్థ, మధురపూడి పంట కాలువలను ఆర్డీవో చైత్రవర్షిణి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు, కోరుకొండ తహసీల్దార్ రాజ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. విమానాశ్రయంలో కురిసిన వర్షం నీరు, వాడకం నీరంతా మధురపూడి కాలువల ద్వారా బయటకు ప్రవహిస్తుంది. ఈ సమయంలో తమ పొలాలను ముంపునకు గురవుతున్నాయని పలువురు రైతులు ఇటీవల కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు ఆర్డీవో చైత్రవర్షిణి పరిశీలకు వచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నుంచి వస్తున్న నీటిని ప్రత్యామ్నాయమార్గంలో తొర్రిగెడ్డలోకి పంపేందుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వి.నరేష్, ఇరిగేషన్ అధికారులు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

గురుచరిత్ర పారాయణ ప్రారంభం

రాజానగరం: ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుచరిత్ర పారాయణ యజ్ఞం గురువారం ఘనంగా ప్రారంభమైంది. అక్టోబర్ పదో తేదీ వరకూ 11 గురువారాలు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని సాయిబాబా భక్తమండలి సభ్యులు తెలిపారు. మధ్యలో ఒక వారం సాయి సచ్చరిత్రను పారాయణ చేస్తారు. ప్రతి గురువారం తెల్లవారుజామున ఇచ్చే కాకడ హారతి అనంతరం ఉదయం 6 గంటలకు పారాయణను ప్రారంభించి, మధ్యాహ్నానికి పూర్తి చేస్తారు. ఆసక్తి ఉన్నవారు ఈ పారాయణలో పాల్గొనవచ్చు.



గురుచరిత్రను పారాయణ చేస్తున్న భక్తులు

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జువాలజీ, కంప్యూటర్ సైన్స్, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించడానికి అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి కోరారు. ఆయా సబ్జెక్టులలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుని, 30వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు సంబంధించిన సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు

జాతర ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

కంబాలచెరువు: ఇన్నీస్‌పేట రెడ్డీల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి జరిగే కన్నమాంబ తల్లి జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఉత్సవ నిర్వాహక కమిటీతో గురువారం ఇన్నీస్‌పేట రామాలయం వద్ద సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ జాతరలో అసాంఘిక కార్యక్రమాలు, అశ్లీల నృత్యాలు వంటి వాటికి తావివ్వొద్దన్నారు. భక్తులకు ఇబ్బందులను లేకుండా, ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో రెండో పట్టణ శాంతి భద్రతల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్, నిర్వాహక కమిటీ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పెండింగ్‌లో ఉన్న జల్ జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులతో ఆమె గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో రూ.489 కోట్లతో చేపట్టిన 670 పనుల్లో ఇప్పటి వరకూ 355 పూర్తయ్యాయని, మరో 84 పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో రూ.19.29 కోట్లతో 243 డ్రైన్ల నిర్మాణం చేపట్టగా 25 పనులు పూర్తయ్యాయని, 46 పురోగతిలో ఉన్నాయని మిగిలినవి పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో రూ.11.76 కోట్లతో చేపట్టిన 392 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లకు 331 పూర్తి కాగా 49 పురోగతిలో ఉన్నాయని అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కింద రూ.43.58 కోట్లతో చేపట్టిన 1,263 పనులకు 820 పూర్తయ్యాయని, 26 పురోగతిలో ఉన్నాయని, మిగిలినవి పూర్తి చేయాలని సూచించారు. ప్రతిపాదిత పనుల్లో రూ.5 లక్షల లోపు పెండింగ్ పనులు తక్షణం పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఈ కేటగిరీ కింద జిల్లాలో 13 పనులు ఉన్నాయని అధికారులు చెప్పారు.

మరిన్ని పనిదినాలు కల్పించాలి

జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరిన్ని పనిదినాలు కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. తన క్యాంప్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ పథకం లక్ష్యాలు, ప్రగతిపై ఆమె గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ ఉపాధి కూలీలకు 30 లక్షల పని దినాలు కల్పించి, రూ.66.7 కోట్ల వేతనాలు చెల్లించామని తెలిపారు. జిల్లాలో ఉపాధి కూలీలకు సగటున రూ.250 అందిస్తున్నామని, మరిన్ని పనులు చేపట్టి సగటు వేతనం రూ.300 అయ్యేలా ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, సిమెంట్ డ్రైన్లు తదితర మౌలిక సదుపాయాల పనులు చేపట్టాలని అన్నారు.

సాధారణ బదిలీతో సరిపెట్టేస్తారా..



జీజీహెచ్‌లో నిరసన తెలుపుతున్న సిబ్బంది

కంబాలచెరువు: ఓ ఉద్యోగి ప్రాణం విలువ కేవలం సాధారణ బదిలీయేనా అని రాజమహేంద్రవరం మినిస్టీరియల్ సిబ్బంది ప్రశ్నించారు. కాకినాడలోని ఫైలేరియా రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ ఆత్మహత్యపై సంతాపం తెలిపారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని మినిస్టీరియల్ విభాగంలో నిరసన తెలిపారు. ఆసుపత్రి మేనేజర్ కోసూరి కేదారేశ్వరరావు మాట్లాడుతూ కేవలం వైద్యాధికారి, విచారణాధికారి దురహంకారమే ఓ నిండు ప్రాణాన్ని బలిగొందన్నారు. ఘటనకు కారకురాలైన మెడికల్ ఆఫీసర్ సాయి రోహిత్‌పై కేవలం బదిలీ వేటు కంటితుడుపు చర్యేనన్నారు. రాధాకృష్ణను విచారణ చేసిన ఎంక్వైరీ ఆఫీసర్ వ్యక్తిగత విషయాలను ప్రస్తావించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. నిరసనలో ఏడీ శ్రీనివాస్ సింగ్, సీనియర్ అసిస్టెంట్ వై.స్టాలిన్, కె.శ్రీలక్ష్మి, వి.సత్యవాణి, వై.యోహాన్, జూనియర్ అసిస్టెంట్లు ఎస్.దీప్తి మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

హరి తాడోజు చిత్రానికి ప్రధాని అభినందన

రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, స్ట్రోకర్స్ అధినేత హరి తాడోజు గీసిన చిత్రం ప్రధాని నరేంద్ర మోదీ మన్ననలు పొందింది. ప్రధాని కన్యాకుమారిలో ధ్యానం చేస్తున్నట్టుగా ఓ చిత్రాన్ని హరి తాడోజుతో మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ వేయించారు. దానిని గురువారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీకి దేవగౌడ బహూకరించారు. ఆ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ విషయం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని హరి తాడోజు తెలిపారు.



ప్రధాని మోదీ ధ్యానం చేస్తున్నట్టుగా హరి తాడోజు గీసిన చిత్రం

సంపూర్ణ అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి

పెదపూడి: సంపూర్ణ అక్షరాస్యతతోనే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయ ల వెంకటలక్ష్మి అన్నారు. కాండ్రేగుల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. సర్పంచ్ కుడిపూడి వీర వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రంగంపేట: 33 కేవీ రంగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని చంద్రేడు, రాయవరం, కోటపాడు, వెంకటాపురం, సుభద్రంపేట, దొడ్డిగుంట, వడిశలేరు, ఎస్టీ రాజాపురం, వెంకన్నపేట, ముకుందవరం గ్రామాలతో పాటు వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని ఊలపల్లి గ్రామంలో విద్యుత్ నిలిచిపోనుందన్నారు.

రాజానగరం: నందరాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లకు వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. దీని కారణంగా నందరాడ, నరేంద్రపురం వినియోగదారులకు పైసమయంలో విద్యుత్ ఉండదు.

- జి.యర్రంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జి.యర్రంపాలెం, పాత, కొత్త తుంగపాడు గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.

అధికారులకు యూటీఎఫ్ వినతులు

సీతానగరం: తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం పలువురు అధికారులకు వినతిపత్రాలు అందించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబులకు వీటిని అందించారు. మండల అధ్యక్షుడు జీవీఎల్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఆర్.పాపారావు మాట్లాడుతూ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, జిల్లా యూనియన్ల పిలుపు మేరకు విద్యారంగ సమస్యలపై, అలాగే పలు డిమాండ్లపై వినతిపత్రాలు అందించామన్నారు.

సిబ్బంది గైర్హాజరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

కడియం: డ్యూటీ సమయంలో గైర్హాజరవుతున్న భవిత సిబ్బందిపై కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్ గురువారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఒకటో నెంబరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో భవిత కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలోని 11 గ్రామాలకు చెందిన ప్రత్యేకావసరాలు గల చిన్నారులు ఈ కేంద్రం ద్వారా సేవలు పొందాల్సి ఉంది. ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక ఆయాను నియమించారు. అయితే ఒక ఉపాధ్యాయురాలితో పాటు, ఆయా కూడా హాజరుపట్టీలో సంతకాలు చేసి బయటకు వెళ్లిపోయారు. తరచూ ఇదే పరిస్థితి ఉండడంతో కేంద్రానికి వచ్చిన పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు నాని దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డితో పాటు కేంద్రం వద్దకు పరిశీలనకు వెళ్లారు. అప్పుడు కూడా అక్కడ ఉపాధ్యాయురాలు, ఆయా లేరు. అంతే కాకుండా కేంద్రం వద్దకు వచ్చిన విద్యార్థులకంటే ఎక్కువ మంది వచ్చినట్లుగా రిజిస్టర్‌లో నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెలుగుబంటి నాని తెలిపారు.